# సెలవ్




## పి.యస్.నారాయణ

**కన్నారావ్** మరదలు పెళ్ళి నిజాం సాగర్‌లో. గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్ళి ఆ పైన బస్సెక్కి నిజాంసాగర్ పోవాలి. ఉత్తరం వచ్చిన మరునాటి నుంచే సామ్రాజ్యం పోరు మొదలెట్టింది— 'మా చెల్లెలు పెళ్ళి, మా చెల్లెలు పెళ్ళి' అంటూ.

"తల్లీ! అందరికీ చెల్లెళ్ళున్నారు. చెల్లెళ్ళ పెళ్ళికి అక్కలు— ఆ పైన అక్కల మొగుళ్ళు వెళ్ళక తప్పదు. కనక, కంగారు పడకోయ్. వెళదాం. వెళదాం!" అని వంద సార్లు చెప్పాడు కన్నారావ్.

మరునాడే భర్తను తీసుకువెళ్ళి గుడ్డల కొట్లో అప్పు చేసి తన కో పట్టు చీర, తన కూతురి కో పట్టు పరికిణీ, ఒక పది జాకెట్టు గుడ్డలు కొన్నది— "మీకు మొన్ననే కదా పెట్టింది ధోవతుల చాపు— చాల్లే, అంటూ మొగుణ్ణి షాపులోనుంచి బయటకు లాక్కు వచ్చింది.

అలా బయటకు వస్తూండగానే కన్నారావ్ అన్న పున్నారావ్ కనపడ్డాడు. వాడో డాక్టరు. కాదంటే పెద్ద పెద్ద నాటకాల్లో చిన్న చిన్న వేషాలు వాళ్ళని గూడా, ఆ పైన అత్తగారికి తెలియకుండా వేస్తుంటాడు.

"బావగారూ— బావగారూ! మా చెల్లెలు పెళ్ళి" అన్నది సామ్రాజ్యం.

రోడ్డుమీద పోయే జనమంతా ఆవిడగారు ఎవరికి చెబుతున్నారో అర్థం కానట్టుగా ఒక్క క్షణం ఆగి పోయి కళ్ళు పెద్దవి చేసుకుని ఆమెనే చూస్తూండిపోయారు.

పున్నారావ్ నడి రోడ్డుమీద మరదల్ని చూసి చాలా ఇదయిపోయాడు. "అలాగా... చాలా శుభం. నిజాంసాగర్ లోనే కదా. అయితే మనమంతా వెళ్ళాలనుకో. మా ఆవిడా, అత్తగారూ ఏమంటారో కనుక్కొచ్చి చెబుతాను. వస్తాను!" అంటూ ఎక్కడ బోల్టు డబ్బు పోసుకుని నిజాంసాగర్ పోవాలో అని భయపడ్డట్టుగా తమ్ముడిని కూడా పలకరించకుండా పరుగెత్తుకెళ్ళి పోయాడు పున్నారావ్.

సామ్రాజ్యం రిక్షా పిలిచింది. భర్తేశ్వరుడిని, పుత్రికారత్నాన్ని ఎక్కించుకుని ఇంటికి వెళ్ళింది. మొగుణ్ణి మరునాడే ఆఫీసులో ఒక పదిహేను రోజులకు సెలవు తగలేయమని వంద సార్లు చెప్పింది. మెడ నొప్పి పుట్టేం దాకా 'సరే, సరే' అంటూ తల వూపాడు కన్నారావ్.

మరునాడు ఆఫీసుకు వెళుతూనే "అయ్యా! నా పెళ్ళాం చెల్లెలు పెళ్ళి. నా యందు దయయుంచి పదిహేను రోజులు సెలవు ఇస్తే నాకు చాలా సంతోషం. నా పెళ్ళానికి మహదానందం!" అన్నాడు ఆఫీసరుతో.

"నో."

"అయ్యా."

"నో."

"క్షమించాలి!"

"నో."

సాయంత్రం ఇంటికి వస్తూనే కన్నారావ్ "నో" అన్నాడు.

సామ్రాజ్యంకు అర్థం కాలేదు.

"ఏమిటి" అన్నట్లుగా ఏడుపు ముఖం పెట్టింది.

"నో."

"ఏమిటి నో! ఏ హాల్లో ఆడుతూంది అది? మీ ఇంగ్లీషు సినిమాల పిచ్చితో నాకు పిచ్చెక్కుతూంది!"

"మీ చెల్లెలు పెళ్ళి నో!"

"అదేమిటి? ఆగిపోయిందని టెలిగ్రామ్ వచ్చిందా!"

"అదీ కాదు. నాకు సెలవు నో!"

"ఎందుకని!"

"నేను పెట్టాను కాని, మా ఆఫీసరు నో అన్నాడు!"

"ఎవడండీ వాడు? వాడి పెళ్ళానికి చెల్లెళ్ళు లేరా? వాడికి చెల్లెళ్ళు లేరా? వాళ్ళకు పెళ్ళిళ్ళు కావా? ఆ పెళ్ళిళ్ళకు ఆయన వెళ్ళడా? పదండి, నే నడుగుతాను. నో అంటాడుటండీ నో. మీ మెతకతనం చూసే నో అంటున్నాడు. రిక్షా పిలవండి— వాడింటికి వెళదాం. కదలండి ముందు— బయటికి వెళ్ళాలి" అన్నది పూనకం వచ్చిన దానిలా వూగిపోతూ.

కన్నారావ్ కాళ్ళూ, చేతులూ ఆడక తత్తర పడ్డాడు— ఎక్కడ ఈ మహంకాళి వెళ్ళి ఆయున్ని ఒక వూపు వూపేస్తుందో నని! ఆ వూపుకు తనకు సెలవు దొరకటం ఎలా ఉన్నా ఉద్యోగానికి నీళ్ళూ నువ్వులూ వదిలేయటమే ఖాయమవుతుంది. అందుకే ఆవిడగారి బి.పి. తగ్గించాలి అన్నట్లుగా "అది గాదే" అన్నాడు.

"ఏది కాదు? దేనికైనా నోరుండాలండీ ఈ రోజుల్లో. లేకపోతే ఇలాగే అఘోరిస్తుంది. నా చెల్లెలు పెళ్ళికి వాడెవడండీ మీకు సెలవు ఇవ్వనన టానికి? వా డేమనుకున్నాడా—నా చెల్లెలు పెళ్ళంటే."

మరునాడు ఆఫీసుకు వెళుతూనే ఆఫీసరు కాళ్ళమీద పడ్డాడు కన్నారావ్, అటూ ఇటూ ఎవ్వరూ లేకుండా చూసి.

అబ్బే! ఆయన 'నో' మీదనుంచి ఒక్క అంగుళం కిందకు దిగితేనా! ఏం చేయాలో తెలియక అయోమయంగా ఆలోచిస్తూ ఇంటికి వస్తే, "టిక్కెట్లు తెచ్చారా?" అని సామ్రాజ్యం గేటు దగ్గరే మొగుణ్ణి నిలవేసింది. "సామాన్లన్నీ సర్దేశాను. రెండు పెట్టెల్లోనే పట్టేసినయి. కామాక్షమ్మ పిన్ని గారి నడిగి వాళ్ళ బెడ్డింగ్ తెచ్చాను. రెండు గారిదిండ్లు కొనుక్కురండి. నాకు దిన్నాయికి దిండు లేకపోతే నిద్ర పట్టదు. చూశారా—శారదమ్మ పిన్నివి రవ్వల నెక్లెస్ ఇస్తారా, పెళ్ళికి వెళ్ళి రాంగానే ఇచ్చేస్తానూ అన్నాను. ఇవ్వదలుచుకోకపోతే ఇవ్వనూ అని చెప్పాలి. అంతేకాని లాకర్లో పెట్టాను—తాళం చెవి కనపడటం లేదు అని దీర్ఘం తీస్తుందా, వెధవ ముఖం వెధవ ముఖం అని. రాధ వడిగానో లేదో ఉంచుకోండి పిన్నిగారూ అంటూ అయిదు కిలోల పంచదార ఇచ్చేసింది. నూటనలభై ఆరు లడ్లయ్యాయండీ. ఇంతకీ మీ ఆఫీసరు ముండా కొడుకు ఏమన్నాడు — రేప్పొద్దున గోల్కొండకు వెళుతున్నామా లేదా!"

అది వరద!

"లోపలికు రానిస్తావా నన్ను?"

"సెలవు ఇచ్చారా అంటే లోపలికు వస్తానూ అంటా రేమిటండీ!"

"సెలవు ఇవ్వలేదు. చచ్చినా ఇవ్వనూ అన్నాడు!"

"అదేం కుదరదు. రేప్పొద్దున వెళ్ళి తీరాలి. సెలవు పెడతారో ఉద్యోగమే మానేస్తారో నాకు తెలియదు. వెళ్ళి టిక్కెట్లు పట్టుకు రండి పోయి ముందు"

"ఆ పక్షి ముండాకొడుకు సెలవు ఇవ్వనో దేవుడా అంటుంటే మధ్యలో నన్నేం చావమంటావే?"



"వాడి పిండాకూడు. వాడు ఇవ్వనంటే నువ్వూరుకుంటావుటయ్యా దద్దమ్మ లాగా. వాడికి లేకపోతే నీకుండ నక్కర్లేదా తెలివి? ఎందుకు వచ్చినయి ఎత్తుకు తిన్నా పెళ్ళి. పద పద. తొందరగా వెళ్ళిరా! ఓసేయ్, బొట్టి ముండా! ఆ రెండు లడ్లూ తిని చావు. మళ్ళీ ఎవుళ్ళ కళ్ళో పడి చస్తాయి వాటిమీద!"

విసురుగా బయటకు వచ్చాడు కన్నారావు. రోడ్లన్నీ చెడ తిరిగాడు. రెండు ప్యాకెట్ల సిగరెట్లను అలవాటు లేకపోయినా తగలేశాడు. రెండు రోజుల క్రితమే అంట కత్తిరించుకున్న జుట్టును పార్కులో కూర్చుని పచ్చిగా పీక్కున్నాడు. ఆ పైన బోరున వాన మొదలైతే ఇక అక్కడ కూర్చోలేక ఇంటికి వచ్చాడు.

"ఇచ్చాడా?"

"ఇవ్వలేదు."

ఆవిడగారు ఇక అన్నం తినమనలేదు. ఈయనగారికి పెట్టమనేటందుకు నోరు లేవలేదు. దుప్పటి బిగించి కళ్ళు మూసుకున్నాడు బలవంతాన.

చెంబులు, పళ్ళాలు, బిందెలు తెగ సొట్టలు పడిపోతున్నాయి. చిన్నదాని వీపు దడదడ లాడితే అది బ్యారుమంది. 'ఏమిటీ అర్ధరాత్రి మద్దెల దరువు' అనుకుంటూ దుప్పటి తీస్తే తెల్లగా తెల్లవారి ఉంది.

మాట్లాడకుండా ముఖం కడుక్కుని రోడ్డెక్కాడు. సామ్రాజ్యం ఎలాగూ కాఫీ ఇవ్వదని తెలుసు. రోడ్లమీద బలాదూరు తిరిగి పది గంటలకు ఆఫీసులో కాలు పెట్టి, "మా ఆవిడ చెల్లెలు పెళ్ళి. నిజాంసాగర్ వెళ్ళాలి. సెలవు కావాలి" అన్నాడు ఆఫీసరు ముందు నిలుచుని.

"ఇవ్వను. చచ్చినా ఇవ్వను. ఎన్నిసార్లు చెప్పాలి! రాత్రి టెలిగ్రామ్ కూడా వచ్చింది హెడ్డాఫీసు నుంచి— ఇనస్పెక్షనుకు వచ్చి చస్తున్నారట వాళ్ళు!"

"గోవిందా. గోవిందా. మా సామ్రాజ్యం నన్ను చంపేస్తుందిరా దేవుడోయ్. ఇక నే నేమి చేతురా దేవుడా!" గొణుక్కుంటూ వెళ్ళి సీట్లో కూలబడ్డాడు కన్నారావ్.

ఒక వేపు ఆఫీసరు ముండాకొడుకును చంపేయాలన్నంత కోపం. మరో వైపు పెళ్ళానికి సర్ది చెప్పలేక పోతున్నాననే బాధ—ఏం చేయాలో తెలియటం లేదు.

లంచ్ బ్రేక్ దాటిపోయినా ఆకలి ఏ మాత్రం అనిపించటం లేదు. ఇంటికి పోతే సామ్రాజ్యం వేరుశనక్కాయలు వేయించినట్లు వేయిస్తుంది. కనీసం రేపొద్దున గోల్కొండకైనా బయలు దేరకపోతే జరగబోయే భీకర సంగ్రామంలో తను బతికి బట్ట కడతాడనుకోవడం అనుమానాస్పదమే.

తల పట్టుకు కూర్చుంటే ఖాళీ కడుపులో నుంచి ఒక ఆయిడియా తన్నుకొచ్చింది. వెంటనే హుషారుగా లేచి క్యాంటీన్‌కి వెళ్ళి కడుపు నిండా టిఫిన్ కొట్టేసి, ఆఫీసరు గదిలో కాలు పెట్టాడు. "ఆఖరి సారిగా అడుగుతున్నాను. మా సామ్రాజ్యం చెల్లెలు స్వరాజ్యం పెళ్ళి. నిజాం సాగర్ వెళ్ళాలి. సెలవు ఇస్తారా, ఇవ్వరా!" అన్నాడు.

"ఏ రాజ్యం పెళ్ళైనా నీకు సెలవు మాత్రం ఇచ్చేది లేదు. మళ్ళీ ఇంకో సారి సెలవు అడిగావా అంటే రిటైరయ్యిందాకా ఇంక్రిమెంట్లు కూడా రాకుండా చేస్తాను. ఖబడ్దార్!"

విసురుగా బయటి కొచ్చాడు. రిక్షా పిలిచాడు. ఎక్కి కూర్చున్నాడు. "పోనీయ్" అన్నాడు భీకరంగా — రిక్షా వాడి గుండె అదిరేలా.

• •

సరిగ్గా గంట తరవాత మళ్ళీ ఆఫీసులో కాలు పెట్టాడు. ఆలస్యం భరించ లేనట్లుగా ఆటోలో వచ్చాడు.

"మా స్వరాజ్యం పెళ్ళి. నిజాంసాగర్ వెళ్ళాలి. సెలవు కావాలి" అన్నాడు ఆఫీసరు ముందు తల వంచుకు నిలబడి.

కన్నారావ్ మాట వింటూనే ఆఫీసరుకు చిర్రెత్తుకొచ్చింది. బాయిలర్‌లో వేసిన రాక్షసి బొగ్గులా చిటపటమంటూ మండిపోసాగాడు. బజ్జర్ నొక్కి పట్టుకున్నాడు. ఆ మోతకు ప్యూను హడావుడిగా పరుగెత్తుకొచ్చాడు. స్టెనోను పిలవమన్నాడు. "నేనంటే ఎగతాళిగా ఉందా నీకు? సెలవు కావాలా నీకు సెలవు. నీ పని చెబుతా నుండు!" అన్నాడు నిప్పులు నలు వైపులా వెద జల్లుతూ.

కన్నారావ్ ఆయన ఫూపుకు తొణక లేదు. బెణక లేదు. నిమ్మకు నీరెత్తినట్లుగా నిలబడ్డాడు. అతి వినయంగా ముందుకు వంగి చేతిలో కాగితాలు ఆయన ముందుంచాడు. "క్షమించాలి. అలా అని ఈ కాగితం మీద రాసివ్వండి. ఇది నా లీవు అప్లికేషను. ఆ పైన ఇది డాక్టరుగారు ఇచ్చిన సర్టిఫికేట్" అన్నాడు మరింత వినయంగా.

"ఎవడా డాక్టరు! నీ కే మొచ్చిందని! శుభ్రంగా గుండ్రాయిలా ఉన్నావు కదా!"

"క్షమించాలి. నాకే రోగమూ లేదండీ ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నానండీ. ఇది ఆ సర్టిఫికేట్టునండీ. సెలవు ఇవ్వనూ అని ఒక్క మాట దానిమీద వ్రాసి ఇవ్వండి. అనవసరంగా మనం ఒకళ్ళ నొకళ్ళం అనుకోవటం బాగుండదండీ. మీరు ఇవ్వనూ అంటే నేను చస్తే వెళ్ళను. ఆ ఒక్క మాటే వ్రాసేయండి!" అన్నాడు మాటల నన్నింటినీ వినయంతో మరింత రంగరించి ఇంకాస్త వంగి.

ఆఫీసరు కుర్చీలో వెనక్కు వాలి పోయాడు. "నా కొంప ముంచావు కదా, కన్నారావ్. ఇప్పుడు ఇనస్పెక్షన్ ఎట్లా?"

• • •

"నా కొంప ముంచారు గదండీ. మీ కిష్టం లేకపోతే రాయని చెప్పాలి కాని, ఈ వెధవ నాటకాలు దేనికి. కాసేపు ఆఫీసరు సెలవు ఇవ్వనన్నాడని బొంకుతారా. కాసేపు ఆపరేషన్ అంటారా! బుద్ధుండా మీ కేమైనా, ఆపరేషన్ చేయించుకుని అంత దూరం ప్రయాణం చేస్తానా అంటే ఎవడైనా ఒప్పుకుంటాడటండీ! అసలు మీరు కూర్చోగలరా అని ఎంత సేపు!" ★







